## జవాబు వచ్చు ప్రార్థన

**"నా దేవునికి ప్రార్థన చేసితిని ఆయన తన ఆలయములో ఆలకించి నా ప్రార్థన నంగీకరించెను. నా మొఱ్ఱ ఆయన సన్నిధిని చేరి ఆయన చెవుల జొచ్చెను."**

(కీర్తన 18:6)

ఒక ఊళ్ళో గిఫ్సి స్మిత్ అనే ఓ అబ్బాయి ఉండేవాడు. తల్లిదండ్రులు లేనందున మేనమామ యొద్ద పెరుగుచున్నాడు. మావయ్య త్రాగుబోతు, తిట్టుబోతు, దేవుని భయము లేశ మాత్రం ఎరుగని ఓ భయంకర మనిషి! కఠినత్వంతో, క్రూరత్వంతో నిండినవాడు. దయాదాక్షిణ్యం లేని అలాంటి మనిషి వద్ద ఆ చిన్నబ్బాయి పెరగడం దినదిన గండంలా ఉండేది.

ఒక రోజు అతని మావయ్య– 'ఒరేయ్! బుద్ధిహీనుడా! ఏరా నీ ఫ్యాంట్సు అన్నీ సరిగ్గా మోకాళ్ళ వద్దే కన్నాలు పడుచున్నాయి. క్రొత్తవి కుట్టిస్తానను కుంటున్నావేమో జాగ్రత్త! కుట్టించనే కుట్టించను వాటితోనే ఏడువు' అని తిట్టాడు.

ఆ చిన్నబ్బాయి మెల్లగా భయంతో ఇలా అన్నాడు "మావయ్యా! నేను నీ కొరకు ఎన్నోసార్లు మోకరించి ప్రార్థన చేయుచున్నాను. అందుచేతనే నా ఫ్యాంట్సు అన్నియు మోకాళ్ళ వద్దనే బాగా చినిగిపోతున్నాయి." ఆ మాటలు ఆ కఠినుడికి ఆశ్చర్యం కల్గించినవి. గుండె బ్రద్దలయినట్లయ్యింది. ఇంతగా ప్రార్థించాల్సిన ఓ ఘోరపాపిని నేను కదా! కాని ఈ బిడ్డ నా కోసం ప్రార్థించడం ఏమిటి, అనే ఒప్పుకోలు కల్గింది.

"దేవా! పాపినైన నన్ను కరుణించు" మన్నాడు. పశ్చాత్తాపంతో యేసుప్రభువుకు ప్రార్థించాడు. రక్షింపబడి నూతన వ్యక్తి అయ్యాడు. ఆ చిన్న బిడ్డ ప్రార్థనకు ప్రభువు ఎంత గొప్ప జవాబిచ్చాడు?

యాకోబు పత్రిక వ్రాసిన పరిశుద్ధ యాకోబు చనిపోయే సమయానికి ఆయన మోకాళ్ళు ఒంటె మోకాళ్ళలాగ కాయలు కాసియున్నాయట, ఎందుకంటే మోకాళ్ళు కాయలు కాయునంతగా అతడు ప్రార్థన చేసెడివాడు.

మన ఫ్యాంట్సు ఎట్లున్నాయ్? మన మోకాళ్ళు ఎట్లున్నాయ్? ఎడతెగక ప్రార్థన చేయుడి అని వాక్యము చెప్పుచున్నది. (I థెస్స 5:17) కష్టాలు కలుగు చున్నాయని ప్రార్థన చేయుట మానక గిఫ్సి స్మిత్‌వలె మోకాళ్ళ దగ్గర ఫ్యాంట్సుకు చినుగులు పడువరకు ప్రార్థించి ఆత్మలను సంపాదించుదము గాక!



వెల రూ.**25/-**

# ప్రియుడా! ప్రార్థించు...

**దేవుని కృపను అడుగుకొను కేకయే ప్రార్థన**

**- యన్. జయపాల్**

**కల్వరి ఇవాంజెలికల్ ఫెలోషిప్**
29, న్యూ కాలనీ రోడ్, పోస్ట్ బ్యాగ్-8265, వేలచ్చేరి, చెన్నై-600 042.
✆ : **044-22434787**

First Edition : 1996
Second Edition : 2006
4000 Copies



© All rights reserved. No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means, electronic, mechanical, photo copying, recording or otherwise without the prior permission of the publisher.

*Our Address*

| CALVARY EVANGELICAL FELLOWSHIP | CALVARY |
| --- | --- |
| Post Bag - 8265,<br>29, New Colony Road,<br>Velachery, Chennai - 600 042. | Post Bag - 1259,<br>Nungambakkam,<br>Chennai - 600 034. |

**Phone : 044-22434787**

# ముందు మాట

"ఆయన పెందలకడనే లేచి యింకను చాలా చీకటి యుండగానే బయలుదేరి, అరణ్య ప్రదేశమునకు వెళ్లి అక్కడ ప్రార్థన చేయుచుండెను." (మార్కు 1:35) మరనేకసార్లు ఆయన ఒలీవ కొండలకు వెళ్లి రాత్రంతయు ప్రార్థనలో గడిపెను. (లూకా 6:12) మరియు "శరీరధారియై యున్న దినములలో మహా రోదనముతోను కన్నీళ్లతోను, తన్ను మరణము నుండి రక్షింపగలవానికి ప్రార్థనలను యాచనలను సమర్పించి, భయభక్తులు కలిగియున్నందున ఆయన అంగీకరింపబడెను" (హెబ్రీ 5:7) అని బైబిలు చెప్పుచున్నది. యేసుక్రీస్తు ఇహలోక జీవితములో ప్రాముఖ్యమైనది ప్రార్థన. ఈ లోకములో దేవునికిష్టులమై జీవించుటకు మనకు కూడా ప్రార్థన ఎంతో ముఖ్యము! అందుకే ప్రభువు తన శిష్యులకు ప్రార్థించుట నేర్పెను గాని ప్రసంగించుట కాదు! ప్రార్థించుట మనము నేర్చుకొంటే ప్రభువు కొరకు మనము ఏమైనా చేయగలము!

సహో. జయపాల్ గారు తన 18వ సంవత్సరములో రక్షింపబడిన తరువాత ప్రార్థనా ప్రాముఖ్యతను గ్రహించెను. తన యౌవనకాలములో ఏకాంత ప్రార్థన, ప్రాతఃకాల ప్రార్థన నేర్చుకొనెను. కన్నీటి ఉపవాస ప్రార్థన ద్వారా మాత్రమే జయ జీవితమును జీవించగలమని, ఆత్మలను రక్షణలోనికి నడిపించగలమని, దురాత్మల ప్రభావము నుండి మనుష్యులను విడిపించగలమని, స్థిరమైన సేవ చేయగలమని గ్రహించెను.

తన 35 సంవత్సరముల సేవలోని ప్రార్థనా అనుభవములను పుస్తక రూపముగా మీకు అందిస్తున్నాము. ప్రార్థనా పూర్వకముగా చదవండి! ఆచరణలో పెట్టండి! అత్యున్నతమైన పరిశుద్ధ జీవితము, విశ్వాస జీవితము, ఆత్మల రక్షణ మనం ప్రార్థన ద్వారానే పొందగలము! ఈ చిన్న పుస్తకము! మీ ప్రార్థనా జీవితమును వృద్ధిచేయును గాక!

-ప్రకాశకులు

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ★ | ప్రార్థించుచున్నావా? | 5 |
| ★ | మనం ఎలా ప్రార్థించాలి? | 7 |
| ★ | రహస్య ప్రార్థన | 8 |
| ★ | సుంకరి ప్రార్థన | 9 |
| ★ | విసుగక చేయు ప్రార్థన | 10 |
| ★ | విశ్వాస ప్రార్థన | 11 |
| ★ | మార్పు తెచ్చు ప్రార్థన | 12 |
| ★ | యుక్త ప్రార్థన | 13 |
| ★ | ఏకీభవించిన ప్రార్థన | 14 |
| ★ | కన్నీటి ప్రార్థన | 15 |
| ★ | బాప్తిస్మము ప్రార్థన | 16 |
| ★ | తగ్గించుకొని చేయు ప్రార్థన | 17 |
| ★ | ఉపవాస ప్రార్థన | 18 |
| ★ | ఒప్పుకోలు ప్రార్థన | 19 |
| ★ | గోజాడు ప్రార్థన | 20 |
| ★ | ఆత్మ ప్రార్థన | 21 |
| ★ | వేదనతో కూడిన ప్రార్థన | 22 |
| ★ | విజ్ఞాపన ప్రార్థన | 23 |
| ★ | ఆసక్తి ప్రార్థన | 24 |
| ★ | ప్రభువుతో మాటలాడు ప్రార్థన | 25 |
| ★ | పోరాడు ప్రార్థన | 26 |
| ★ | యెడతెగని ప్రార్థన | 27 |
| ★ | చేతులెత్తి చేయు ప్రార్థన | 28 |
| ★ | పట్టుదల ప్రార్థన | 29 |
| ★ | అపవిత్రాత్మలతో పోరాడు ప్రార్థన | 30 |
| ★ | మోకాళ్ళ ప్రార్థన | 31 |
| ★ | జవాబు వచ్చు ప్రార్థన | 32 |


# ప్రార్థించుచున్నావా?

ప్రార్థన అంటే దేవునితో చేయు సంభాషణ అనగా దేవునితో మాట్లాడుట, దేవుని మాటలు వినుట! ఒక్క మాటలో చెప్పాలంటే మనస్సు విప్పి యేసయ్యతో మాట్లాడుటయే ప్రార్థన! కొందరు ప్రార్థన అంటే ఏవో కొన్ని శ్లోకాలను, పదజాలాలను వల్లించుట అనుకొందురు. అయితే హృదయం తెరచి, మన స్థితిని గురించి మామూలు మాటలతో దేవునితో మాటలాడుటయే ప్రార్థన!

ప్రార్థన హృదయమును తెరచును, మనస్సును శుభ్రపరచును. ప్రార్థన పరలోకపు తలుపులు తెరచే తాళపు చెవి వంటిది! ప్రార్థించునప్పుడు నీ లోపాలను తెలుసుకొందువు; నీ హృదయమును దేవుని తలంపులతో నింపుకొందువు. ప్రార్థన ద్వారా పరలోకమును నీ హృదయములోనికి తెచ్చుకొందువు. ప్రార్థించువారు పాపమునకు దూరముగా ఉందురు. అయితే పాపమును దాచుకొనుటకు ఆశించువారు ప్రార్థించలేరు.

మాటలు లేని మూల్గుల ప్రార్థన కూడా దేవుడు ఆలకించి జవాబిచ్చును. ప్రార్థించుట ద్వారా మనము సాతానును జయించగలము. ప్రార్థన మనకు కేడెము వంటిది, దేవునికి అర్పణ వంటిది; అయితే సాతానుకు కొరడా వంటిది! కాబట్టే మోకాళ్ళమీద వున్న భక్తుడ్ని చూస్తే సాతాను గజగజలాడును.

మరి నీవు ప్రార్థించుచున్నావా? యేసు నామములో మనము ప్రార్థించు నప్పుడు మన సకల అవసరములు తీరును. “మీ సంతోషము పరిపూర్ణము అగునట్లు అడుగుడి, మీకు దొరుకును” (యోహాను 16:24) అని ప్రభువు అంటున్నాడు. “మరియు మీరు ప్రార్థన చేయునప్పుడు వేటిని అడుగుదురో అవి దొరికినవని నమ్మిన యెడల మీరు వాటినన్నిటిని పొందుదురని వారితో చెప్పెను”. (మత్తయి 21:22) గనుక ప్రార్థించుదము!

ప్రభువు నేర్పిన ప్రార్థనలో ‘పరలోకమందున్న మా తండ్రీ’ అన్నప్పుడు మనము ఐక్యత కలిగియుండాలని; ‘నీ నామము పరిశుద్ధ పరచబడును గాక’ అన్నప్పుడు, ఆయన నామాన్ని ధరించిన మనము పరిశుద్ధ పరచబడాలని; ‘నీ రాజ్యం వచ్చును గాక’ అన్నప్పుడు, ఆయన రాజ్యవారసులుగా మనము సిద్ధపడి ఉండాలని;

'నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక' అన్నప్పుడు, ఏది ఏమైనప్పటికి మనము ప్రభువు చిత్తం చేసేవారిగా ఉండాలని; 'మా అనుదిన ఆహారము నేడు మాకు దయచేయుము' అన్నప్పుడు, రేపటిని గురించి చింతింపక, తన గుప్పిలి విప్పి మనల్ని పోషించే ప్రభువుపై విశ్వాసం ఉంచాలని; 'మా యెడల అపరాధములు చేసిన వారిని మేము క్షమించినట్లు మా అపరాధములను క్షమించుము' అన్నప్పుడు, ఇతరులను క్షమించనిచో మనకు క్షమాపణ లేదని; 'మమ్మును శోధనలోనికి తేక కీడు నుండి తప్పించుము' అన్నప్పుడు శోధన నుండి, కీడు నుండి మనలను తప్పించగలవాడు ప్రభువేనని మనము నమ్మి ప్రార్థించవలెను.

నీ హృదయాంతరేంద్రియములలో నుండి నీవు దేవున్ని పిలిచే కేకయే ప్రార్థన! ప్రార్థన ద్వారా అసాధ్యమైన కార్యాలను సాధ్యపరచగలము. కాబట్టి మన వ్యాధులలో, జీవితంలో కలుగు చిక్కులలో, కుటుంబములో ఉన్న సమస్యలలో, ఆర్థికమైన ఇబ్బందులలో ప్రభువుకి మొఱ్ఱ పెట్టినచో జవాబులు పొందగలము. కాబట్టి ప్రియుడా ప్రార్థించు; జీవితములో కలిగే ప్రతి సమస్యకు జవాబు మొదటిది ప్రార్థన; రెండవది ప్రార్థన; మూడవది ప్రార్థన. గనుక ప్రార్థించుము.

ప్రార్థన ద్వారా సమస్తము సాధ్యము. జార్జివిట్‌ఫీల్డ్ అనే భక్తుడు తన పట్టుదల ప్రార్థనల ద్వారా సాతాను సంతగా ఉన్న స్థలములో సింహమువలె గర్జించుచు ఒక్క దినముననే వెయ్యి ఆత్మలను సంపాదించెను. దినమునకు మూడు గంటలకు తక్కువ కాకుండా ప్రార్థిస్తే గాని నాకు తృప్తి లేదన్న మార్టిన్ లూథర్ సంఘ దిద్దుబాటునకు మూలకారకుడై మూఢాచారములకు స్వస్తి చెప్పెను. రాత్రింబగళ్ళు ఉపవాసములతో, వస్త్రములు చెమటతో తడిచి పోవునంత భారముగా ప్రార్థించిన డేవిడ్ బ్రెయినార్డ్ అనాగరికులు, మూర్ఖులునైన రెడ్ ఇండియన్స్‌ను ప్రభువు కొరకు సంపాదించెను. ప్రార్థనాపరుడైన హైడ్ అనే భక్తుడు తన గుండె ఎడమ ప్రక్క నుండి కుడి ప్రక్కకి జరుగువరకు ప్రార్థించెను; ప్రార్థన ద్వారా అనేక వేల ఆత్మలను సంపాదించెను. జార్జిముల్లర్ అనే భక్తుడు తన ప్రార్థనలకు అప్పటికప్పుడే జవాబులు పొందుచు, అనేక వేల మంది అనాథలను పోషించెను. కాబట్టి ప్రార్థన ద్వారా సమస్తము సాధ్యము!

గనుక ప్రియుడా! ప్రార్థించు. ఒకే రోజు కూర్చొని ఈ పుస్తకమును చదువుటకు ప్రయత్నించక; రోజుకొక పేజీ చొప్పున చదివి ప్రార్థించండి. గొప్ప దీవెన పొందెదరు!



# మనం ఎలా ప్రార్థించాలి?

మనం చేసే ప్రార్థనల్లో చాలా వరకు స్వలాభాపేక్ష తొంగి చూస్తుంటుంది. అందుచేతనే అవి శక్తి రాహిత్యంగా ఉంటూ ఆశించిన ఫలాన్ని సాధించి పెట్టలేక పోతున్నాయి. ప్రార్థనలో వేటిని మనం యాచిస్తామో వాటిలో రవ్వంతైనా లోపం లేదు. పైపెచ్చు దేవుని దృష్టిలో కూడా అవి ఎంతో ప్రీతిపాత్రమైనవే! మరలాంటప్పుడు వచ్చిన చిక్కేమిటి? ఎందుకు దేవుడు అడిగిందే తడవుగా అనుగ్రహించలేకపోతున్నాడు.

ఎందుచేతనంటే, ప్రార్థనకు వచ్చే జవాబులో దేవుడే స్తుతి, ప్రశంస పొందాలని మనం గాఢంగా వాంఛించడం లేదు. ఆ జవాబేదో మనకు సుఖాన్ని, సంతోషాన్ని తెచ్చి పెట్టాలని కోరుకుంటాం. గనుకనే దేవుని ప్రమేయం లేకుండా తమ స్వంత సుఖశాంతుల కోసం ప్రార్థించే వ్యక్తులు, ఫలితం పొందక నిరాశా, నిస్పృహలకు గురవుతున్నారు.

ఉదాహరణకు కొందరు సోదరీమణులు తమ భర్తలు పరివర్తన చెందాలని ఎడతెగక ప్రార్థిస్తూ ఉంటారు. అలా వారు చేయడం అన్నివిధాలా సముచితమే! కాని వారి ప్రార్థన వెనుక దాగివున్న స్వార్థచింతన దేవునికి అసహ్యం కలిగిస్తుంది. వారి కాంక్షంతా తమ భర్తల మనసులు మారితే వారి దురభ్యాసాలు మానివేస్తారని, భేదాభిప్రాయాలతో సతమతమౌతున్న తమ కుటుంబ జీవనం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా నింపాదిగా, నిశ్చింతగా సాగిపోతుందని! అందుచేతనే వారి ప్రార్థనకు జవాబు లభించడం లేదు. దానికి బదులు తన భర్త నరకానికి ఉరకలేస్తున్నాడని; తన ముందరే యేసుక్రీస్తు రక్తాన్ని, ఆయన ప్రేమను తృణీకరిస్తూ; దేవుని నామాన్ని ఘనహీనం చేస్తున్నాడనే భారంతో, బాధతో ఓ భార్య ప్రార్థించినపుడు దేవుడు తప్పక ఆలకిస్తాడు, జవాబిస్తాడు.

అలాగే మరికొందరు పరిశుద్ధాత్మ నింపుదల కోసం నిరంతరం ప్రార్థిస్తుంటారు. కాని అందులో కృతార్థులు మాత్రం కాలేకపోతున్నారు. లేఖనపరంగా చెప్పుకోవాలంటే పరిశుద్ధాత్మను అనుగ్రహించడం పరలోక తండ్రి అభీష్టమే! (లూకా 11:13) కాని ఎందుచేతనో దేవుడు తన వాగ్దానాన్ని వీరి విషయంలో నెరవేర్చలేకపోతున్నాడు. పతన జీవితాలు పునర్నిర్మించుకొనేందుకు కాక; క్రైస్తవ బోధకులుగా ఎక్కువ శక్తిని పొంది, ఎక్కువ సేవ చేసి, తద్వారా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలనే స్వప్రయోజనార్థం కోసమే వీరు ప్రార్థన చేస్తారు. అసలు మనం పరిశుద్ధాత్మ పూర్ణత కోసం ఎందుకు ప్రార్థించాలి? ఎందుకంటే అథమస్థాయి క్రైస్తవ జీవితాల ద్వారా, శక్తిరహితమైన దైవసేవ ద్వారా సకల సృష్టికర్తయైన దేవుడు అపఖ్యాతిపాలు కాకూడదు అని; అంతేకాదు మనం పొందిన నూతనత్వం, శక్తి సంపద కారణంగా దేవుడు మహిమను పొందాలి అని! మనము ఇటువంటి ఆశతో ప్రార్థిస్తే ప్రభువు తప్పక జవాబిస్తాడు. కాబట్టి మనం ఇందుకే ప్రార్థించాలి అని ఆర్.ఎ.టోరిగారు అన్నారు! గనుక ప్రార్థిద్దాం!

★

# రహస్య ప్రార్థన

**"నీవు ప్రార్థన చేయునప్పుడు, నీ గదిలోనికి వెళ్ళి తలుపు వేసి, రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థన చేయుము."** (మత్తయి 6:6)

రహస్య ప్రార్థన లేక ఏకాంత ప్రార్థన ఒకనియొక్క జీవితములో ఎంతో అవసరము. ఒకనియొక్క ప్రార్థనా జీవితమును అతనియొక్క రహస్య ప్రార్థనను బట్టియే కొలత వేయగలము.

నీవు బహిరంగముగాను, గుంపులలోను ఎన్ని దీర్ఘ ప్రార్థనలు చేసినను; ఏకాంతముగా ప్రార్థించనిచో నీవు సరియైన ప్రార్థనా జీవితము లేనివాడవే! ఏకాంతముగా నీవు ప్రార్థించుచున్నప్పుడు నీ హృదయస్థితిని నీవు ఎరుగుదువు. దేవుని ఉద్దేశ్యములను, తలంపులను పొందుదువు.

ఈ దినములలో యౌవ్వనస్థులు, తల్లిదండ్రులు, చివరికి బోధకులు కూడా ఏకాంత ప్రార్థన నేర్చుకొననందువలన శక్తిలేని వారుగాను, పాపము మీద జయము లేనివారుగాను, ఆత్మలను సంపాదించలేనివారుగాను ఉంటున్నారు. అనేకులు ఏకాంత ప్రార్థనకు సమయం లేదంటున్నారు. ఏదో కొన్ని నిమిషములు తొందరలో రెండు మాటలు చెప్పుకొని, పనులకు వెళ్ళిపోవుదురు. గాని ప్రతి దినము ఏకాంతముగా కొద్ది సమయమునైనను ప్రభువుతో ప్రార్థనలో గడపరు.

క్రీస్తు ఈ లోకములో ఉన్నప్పుడు ఏకాంతముగా కొండమీదకు వెళ్ళి ప్రార్థన చేసికొనెడివాడు. "ఆయన ప్రార్థన చేయుటకు ఏకాంతముగా కొండ యెక్కిపోయి, సాయంకాలమైనప్పుడు ఒంటరిగా ఉండెను" (మత్తయి 14:23) అని వాక్యము చెప్పుచున్నది. పాపములేని క్రీస్తుకే అటువంటి ప్రార్థన అవసరమైనచో పాపులమైన మనకు మరి ఎంతో అవసరము కాదా?

దానియేలు మేడమీదనున్న తన గదిలోనికి పోయి దినమునకు ముమ్మారు ఏకాంతముగా ప్రార్థించెడివాడు. (దానియేలు 6:10) ఇటువంటి ఏకాంత ప్రార్థన మనము నేర్చుకొనుచున్నామా? లేక మనుష్యులు చూచుచున్నప్పుడు మాత్రము ప్రార్థన చేయుచున్నట్లు కనిపించుచున్నప్పటికి నిజమైన రహస్య ప్రార్థన లేకుండా ఉంటున్నామా? నీవు నీ గదిలోనికి వెళ్ళి ప్రార్థించు, నీవు ఒంటరిగా వెళ్ళి ప్రార్థించు; అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలము నిచ్చును. ఆమేన్!



# సుంకరి ప్రార్థన

**"అయితే సుంకరి దూరముగా నిలుచుండి, ఆకాశము వైపు కన్నులెత్తుటకైనను ధైర్యము చాలక రొమ్ము కొట్టుకొనుచు- దేవా, పాపినైన నన్ను కరుణించుమని పలికెను."** (లూకా 18:13)

ఎవరైనను నాకు ప్రార్థన చేయుట తెలియదు అనుకొనినచో, వారు "దేవా! పాపినైన నన్ను కరుణించుము" అను ఈ ప్రార్థనతో మొదలు పెట్టవచ్చును. ఒక పాపి మొదటగా చేయవలసిన ప్రార్థన ఇది. ఇట్లు దీనముగా "నేను పాపిని, నన్ను కరుణించుము" అని ప్రార్థించేవారు ఈనాడు కన్పించుట లేదు. "మేము పాపులము, మమ్ము కరుణించుము" అని అలవాటుగా ప్రార్థనలు చేయువారు మాత్రము అనేకులు!

ఇతరులను చూచి "నేను వారిలాగ లేను, నేను బాగున్నాను; నీకు వందనములు" అన్న పరిసయ్యునివలె ప్రార్థించుదురు. (లూకా 18:11,12) నీవు ప్రార్థన చేయునది నీ గొప్పతనమును మెచ్చుకొనుటకు, ఇతరులతో పోల్చుకొనుటకు కాదుగాని, నీ నిజమైన స్థితిని తెలుసుకొని దేవుని కృప కొరకు వేడుకొనుటకే!

నీ ప్రార్థనలో అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దని ప్రభువు చెప్పెను. (మత్తయి 6:7) అనేకులు తమ విస్తారమైన మాటలతో కూడిన ప్రార్థనలలో ఇతరులకు, దేవునికి కూడా బోధ చేయుటకు ప్రయత్నించుదురు. ప్రార్థన చేయునది ఇతరులకు బోధించుటకు కాదు గాని, ప్రభువు యొద్ద నుండి మనం నేర్చుకొనుటకే!

నీవు దేవుని సన్నిధిలోనికి వెళ్ళినప్పుడు దీనతతో, దేవుని సన్నిధిలో నిలుచుటకు, మట్లాడుటకు తగినవాడిని కాదన్నట్లుగా "ప్రభువా! నన్ను కరుణించుమని ప్రార్థించుచున్నావా?" దీనుల ప్రార్థన ఆయన తప్పక ఆలకించును, వెంటనే జవాబిచ్చును. గర్విష్ఠుల ప్రార్థన ఆయన కసహ్యాము, స్వనీతి పరుల ప్రార్థన ఆయన వినడు. నీ ప్రార్థన ఎట్లున్నది?

"చిత్తగించుము, నేను నీచుడను, నేను, నీకు ఏమని ప్రత్యుత్తరమిచ్చెదను? నా నోటిమీద నా చేతిని ఉంచుకొందును" (యోబు 40:3) అని యోబు దీనతతో ప్రభువు సన్నిధిలో జవాబిచ్చెను. ప్రభువా! సుంకరి ప్రార్థన నేర్పుము అని ప్రార్థించుము. ఆమేన్!

★

# విసుగక చేయు ప్రార్థన

**"వారు విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను".** (లూకా 18:1)

అనేకులు కొన్ని గంటలు లేక కొన్ని దినములు కొన్ని విషయములను గూర్చి ప్రార్థన చేయుదురు గాని, జవాబు దొరకలేదని విసికెదరు. మనుష్యులు తమ పై అధికారులకు అర్జీ పెట్టుకొన్న తరువాత వాటి కొరకు మరల మరల ఆఫీసుల చుట్టూ తిరుగుదురు. గాని, ప్రార్థన చేయునపుడు తమ ప్రార్థనలకు వెంటనే జవాబు రాలేదని విసిగి ప్రార్థన చేయుట మానివేయుదురు. ఇది ఎట్లున్నదంటే భిక్షగాడు భిక్షమడిగి, భిక్షం తెచ్చునంతలో వెళ్ళిపోయినట్లున్నది.

కొందరు ఎంతోసేపు ప్రార్థన చేసి, దేవుడు జవాబు ఇచ్చునంతలో విసుగుతో ప్రార్థన ఆపుజేసి వెళ్ళిపోవుదురు. ఈ లోకములో మనము ఎన్నో విషయముల కొరకు విసుకక కనిపెట్టుట లేదా! అట్లయిన దేవుని జవాబుల కొరకు మరి ఎంతగా ఓర్పుతో కనిపెట్టవలసి యున్నది? కొందరు "నేను ఎంతో కాలము నుండి ప్రార్థన చేయుచున్నాను. కాని, ప్రార్థనకు జవాబు దొరకలేదు" అని విసిగెదరు, ప్రార్థించుట మానెదరు.

గాని, దేవుడు మన ప్రతి ప్రార్థనకు "అవును," "కాదు" లేక "కనిపెట్టు" అను జవాబులను వెంటనే యిచ్చును. కాని, మనలో అనేకులము అది తెలుసుకొనలేక విసిగెదము. ముఖ్యముగా ఆయన "కనిపెట్టు" అను జవాబిచ్చినపుడు విసుకక కనిపెట్టవలెను.

మోనికా అను ఒక తల్లి దుష్టుడగుచున్న తన కుమారుని కొరకు ముప్పైమూడు సంవత్సరములు ప్రార్థించెను. తాను ప్రార్థించుకొలది అతడు బహుగా దుష్టుడగు చున్నను విసుకక జవాబు వచ్చు వరకు ప్రార్థించెను. చివరకు ఆ కుమారుడు "పరిశుద్ధుడైన అగస్టీన్" అని పిలువబడునంతగా మార్చబడెను. జార్జిముల్లరు అనే భక్తుడు ఇద్దరి మారుమనస్సు కొరకు నేను అరువది సంవత్సరములు ప్రార్థించితినని తన డైరీలో వ్రాసుకొనెను. నీవు చేయు ప్రార్థన దేవుని చిత్తానుసారమైనదా? అని తెలుసుకొని ఎన్ని దినములైనను, ఎన్ని సంవత్సరములైనను విసుకక ప్రార్థించినచో దేవుడు తప్పక జవాబిచ్చును. నీవు నీ కుమార్తె కొరకో, నీ కుమారుని కొరకో, లేక బంధువుల కొరకో ప్రార్థించి, ప్రార్థించి ఇక లాభము లేదని విసిగితివా? విసుకక నిత్యము ప్రార్థించుమని ప్రభువు సెలవిచ్చుచున్నాడు. కాబట్టి విసుకక ప్రార్థించుము. నీ ప్రార్థనలకు జవాబు పొందుము.

★



# విశ్వాస ప్రార్థన

**"అయితే, అతడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను".** (యాకోబు 1:6)

"మరియు మీరు ప్రార్థన చేయునపుడు వేటిని అడుగుదురో అవి దొరికినవని నమ్మిన యెడల మీరు వాటినన్నిటిని పొందుదురని వారితో చెప్పెను." (మత్తయి 21:22) అనేకులు ఎంతెంతో ప్రార్థన చేయుదురు, ఎన్నెన్నో విషయముల కొరకు అడుగుదురు. కాని దేవుడు వాటిని వారికిచ్చునని హృదయాంతరంగంలో విశ్వసించరు. కాబట్టి వారేమియు పొందలేక పోవుచున్నారు.

"ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగా దయ చేయువాడు. అయితే అతడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను" (యాకోబు 1:5, 6) అని వాక్యం చెప్పుచున్నది. దేవుని మాటలను నమ్మకపోవుటే అవిశ్వాసము. విశ్వసించకుండా చేయు ప్రార్థన ఎంతైనను సైతాను చేయనిచ్చును. ఎందుకనగా అవిశ్వాసముతో, అస్థిర మనస్సుతో ఎంత ప్రార్థించినను నీవు దేవుని యొద్దనుండి ఏమియు పొందలేవు.

కావున నీ ప్రార్థనను దేవుడంగీకరించుచున్నాడని విశ్వసించవలెను. నాలుగు దినముల క్రితము చనిపోయిన లాజరు సమాధిలో ఉన్నప్పుడు, "యేసు కన్నులు పైకెత్తి– తండ్రీ, నీవు నా మనవి వినినందున నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నాను. నీవు ఎల్లప్పుడును నా మనవి వినుచున్నావని నే నెరుగుదును" (యోహాను 11:41, 42) అని ప్రార్థించి లాజరును బయటికి రమ్మని పిలిచెను. అది విశ్వాసపు ప్రార్థన! ఐదు రొట్టెలు, రెండు చేపలు ఆయన చేతికి ఇవ్వబడినపుడు ఆ ఐదు వేల మందికి సరిపోవునట్లు తండ్రి ఆశీర్వదించును అని విశ్వసించి ఆకాశమువైపు కన్నులెత్తి, దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పంచి పెట్టుటకు యిచ్చెను. (మార్కు 6:41) అది విశ్వాసపు ప్రార్థన! సైతాను చెప్పు అవిశ్వాసపు మాటలను నమ్మక విశ్వాసముతో ప్రార్థించుము. దేవుడు అసాధారణ కార్యములు చేయువాడని, నీ ప్రార్థనలకు జవాబు ఇచ్చునని నమ్ముము, ప్రార్థించుము!

★

# మార్పు తెచ్చు ప్రార్థన

**"ఆయన.....ప్రార్థన చేయుటకు ఒక కొండ ఎక్కెను. ఆయన ప్రార్థించు చుండగా ఆయన ముఖరూపము మారెను; ఆయన వస్త్రములు తెల్లనివై ధగ ధగ మెరిసెను."** (లూకా 9:29)

ఆయన ప్రార్థించుచుండగా ఆయన ముఖ రూపము మారెను. ప్రార్థించు చుండగా మార్పు- ముఖములో మార్పు, దుస్తులలో మార్పు, హృదయములో మార్పు, స్వభావములో మార్పు; ప్రార్థించు వారి యొక్క పాత స్వభావము, పాత అలవాట్లు పూర్తిగా మారిపోవును.

మోషే సీనాయి కొండమీద 40 దినములు ఉపవాసముండి ప్రార్థించిన తరువాత అతడు క్రిందకు వచ్చినప్పుడు ఆయన ముఖము వెలుగుతో ప్రకాశించు చుండెను. ప్రజలు ఆ వెలుగును చూడలేకపోయిరి. కోటి సూర్యుల వెలుగు గలిగిన దేవుని సముఖములో కూర్చొనినపుడు మోషేకు తెలియకుండానే మోషే ముఖము వెలుగుతో ప్రకాశించెను. (నిర్గమకాండము 34:28-30)

నీవు ప్రార్థన నుండి బయటికి వచ్చినపుడు ఎవరైనను నీ ముఖములో దేవుని వెలుగును చూడగలుగుచున్నారా? దేవుని సంతోషము, సమాధానము నీ ముఖములోనికి, నీ మాటలలోనికి వచ్చినవా? లేనిచో నీ ప్రార్థన సరి అయినది కాదు. నీవు దేవునిని ముఖాముఖిగా కలుసుకొనలేదు. దేవునికి వినబడునట్లుగా ప్రార్థించలేదు. అందువలననే నీవు ప్రార్థన నుండి వచ్చిన తరువాత కూడా కోపముతోను, విసుగుతోను, ప్రేమ హీనతతోను ఉంటున్నావు. నీవు ఎట్లు ప్రార్థనకు కూర్చున్నావో అట్లే లేచినచో ఏమి ప్రయోజనము?

క్రీస్తు ప్రార్థించుచుండగా ఆయన స్వరూపము పూర్తిగా మారిపోయెను. దేవుని శక్తితో నింపబడెను. ఆయన వస్త్రములు ధగ ధగ మెరిసెను. ఆకాశము నుండి "ఈయన నా ప్రియకుమారుడు. ఈయన యందు నేనానందించుచున్నాను" అను స్వరమును వినెను (మత్తయి 17:5). కావున నీవును ప్రార్థించుచున్నప్పుడు ఇట్టి మార్పును పొందవలెను, దేవుని స్వరమును వినవలెను. అంతవరకు విడవకుండా ఒంటరిగా వెళ్ళి ప్రార్థించుము. ★



# యుక్త ప్రార్థన

**"మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్చరింప శక్యము కాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు."** (రోమా 8:26)

అనేకులకు యుక్తముగా ఎట్లు ప్రార్థించవలెనో తెలియదు. పెద్దపెద్ద మాటలతోను, చక్క చక్కటి మాటలతోను వివరించుచు; దేవునికి, చుట్టు ఉన్నవారికి బోధ చేయుచున్నట్టుగా ప్రార్థించుదురు. గుంపులో ఉన్నప్పుడు వ్యర్థమైన మాటలతో దీర్ఘ ప్రార్థనలు చేయుదురు. కాని, ఏకాంతముగా ఉన్నప్పుడు ఒక్క నిముషమైనను ప్రార్థన చేయరు. దేవా! నీకు స్తోత్రములు; ప్రభువా! నీకు స్తోత్రములు; నాయనా! తండ్రీ! అను మాటలతోనే ప్రార్థనలు నింపుదురు. అట్లు దీర్ఘ ప్రార్థనలు చేసి, "అబ్బ! నేను చాలాసేపు ప్రార్థించితినని తృప్తి పడుదురు. కాని, నేనేమి ప్రార్థన చేసితిని? నా ప్రార్థనలోని గురి ఏమిటి? ఇంతసేపు చేసిన ప్రార్థన వలన నేనెటువంటి ఆధ్యాత్మిక మేలు పొందితిని? ప్రభువు నా హృదయములో పెట్టిన భారమేమిటి?" అని గ్రహింపరు.

కాని, నీవు ఆత్మతో ప్రార్థించినపుడు యుక్తముగా ప్రార్థించుదువు. ఆత్మతో చేసిన ప్రార్థన కొద్ది నిమిషములు చేసినప్పటికిని నీవు బహుగా బలపడుదువు. నీ హృదయములోని అనుమానములు, సమస్యలు తీరిపోవును. ఆత్మలో ప్రార్థించు నపుడు రానైయున్న శోధనలు ఎరిగి నీకు తెలియకుండానే వాటి విడుదల కొరకు ప్రార్థించెదవు. ఆత్మలో ప్రార్థించినప్పుడు దేవుని చిత్తానుసారముగా ప్రార్థించెదవు.

ఇట్లు ఉచ్చరింప శక్యముకాని మాటలతో ప్రార్థనలు చేయుచున్నావా? ప్రభువు ఏకాంతముగా ఉన్నప్పుడు రాత్రంతయు ప్రార్థించెడివాడు. కాని, బహిరంగంగా ప్రార్థించినపుడు బహు క్లుప్తమైన ప్రార్థనలు చేసెను. సిద్ధపరచబడని హృదయములో నుండి వ్యర్థమైన దీర్ఘ ప్రార్థనలు వచ్చును; సిద్ధపరచబడిన హృదయములో నుండి క్లుప్త ప్రార్థనలు వచ్చును. గనుక హృదయము సిద్ధపరచుకొని యుక్తప్రార్థన చేయుము. నీ మాటల ప్రార్థన కంటె నీ మూలుగుల ప్రార్థన దేవునికి ఇష్టము! ★

# ఏకీభవించిన ప్రార్థన!

**"మీలో ఇద్దరు తాము వేడుకొను దేనిని గూర్చియైనను భూమి మీద ఏకీభవించిన యెడల అది పరలోకమందున్న నా తండ్రి వలన వారికి దొరకునని మీతో చెప్పుచున్నాను."** (మత్తయి 18:19)

ఏకీభవించి ప్రార్థించుట అనగా నీవు ఇతరులతో చేరి ప్రార్థించునపుడు నీవు వారితో ఏకీభవించి ప్రార్థించవలెను. ఇద్దరు ముగ్గురు నా నామమున ఏకీభవించి ప్రార్థించినచో వారడిగిన దానిని నేను వారికిత్తును. "మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను దేనిని గూర్చియైనను భూమి మీద ఏకీభవించిన యెడల అది పరలోకమందున్న నా తండ్రి వలన వారికి దొరకునని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 18:19) అని ప్రభువు చెప్పెను. ఇద్దరు ముగ్గురు ప్రార్థించినచో అని చెప్పలేదు గాని, ఏకీభవించి ప్రార్థించినచో అని చెప్పెను. మనలో అనేకులము కలసి ప్రార్థిస్తున్నాము గాని మనస్సులు కలవటము లేదు; ఏక మనస్సుతో ప్రార్థించుట లేదు. కావున మన ప్రార్థనల ద్వారా ఏమియు పొందలేక పోవు చున్నాము.

ఆది సంఘములో అందరు ఏక మనస్సుతో ఏకీభవించి ప్రార్థించిరి. (అపో. కార్య. 1:14) వారందరును ఏక హృదయమును, ఏకాత్మయుగలవారై యుండిరి. (అపో. కార్య. 4:32) కాబట్టి దినదినము అనేకులు సంఘములో చేర్చబడు చుండిరి. (అపో.కార్య. 2:47) మరియు వారు ప్రార్థించుచుండగా వారు కూడియున్న చోటు కంపించెను. దేవుని ఆత్మతో నింపబడిన వారై దేవుని వాక్యమును ధైర్యంతో బోధించిరి. (అపో. కార్య. 4:31) సంతోషముతో, సమాధానముతో ఉండిరి. (అపో.కార్య. 2:46, 47)

అయితే, సైతాను సహోదరుల మీద నేరములు మోపి ఏక మనస్సు లేకుండా చేయును. హృదయాంతరంగంలో ద్వేషము, కోపము, సంశయమును పెట్టును గనుక కలసి ప్రార్థించుదురు గాని ఏకీభవించి ప్రార్థించనందువలన ఎటువంటి ఫలమును చూడరు. ఇద్దరు ముగ్గురు కలసినపుడు ఏకీభవించి ప్రార్థించలేక పోయినచో మొదట ఒకరి కొరకు ఒకరు ప్రార్థించుకొని, తరువాత ఏకీభవించి ప్రార్థించండి! మొదట ఒకరితో ఒకరు హృదయమును సరిచేసుకొని తరువాత ప్రార్థించండి. భార్య, భర్త ఏకీభవించి ప్రార్థించినచో ఎంతో ఆశీర్వాదము వచ్చును. ఆ ఇంటి ప్రతి అవసరత తీర్చబడును. ఇద్దరు ముగ్గురు ఏకీభవించి, ప్రార్థించినచో గొప్ప కార్యములు జరుగును. ★



# కన్నీటి ప్రార్థన

**"ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు, దుఃఖించుచు మనఃపూర్వకముగా తిరిగి నా యొద్దకు రండి."** (యోవేలు 2:12)

ఈ దినములలో అనేకులు కన్నీళ్ళతో ఎందుకు ప్రార్థన చేయవలెను? విశ్వసించితే చాలదా? మౌనముగా ప్రార్థించితే చాలదా? అందురు. లోక సంబంధమైన వస్తువుల కొరకు, బంధువుల కొరకు ఏడ్చెదరు. మరి ఎంత ఎక్కువగా ఆత్మ సంబంధమైన వాటి కొరకు ఏడ్వవలసి యున్నది. ఈ విధముగా పాపమును ఒప్పుకొని ఏడ్చుట వాక్యానుసారమైనది. "దావీదు సంతతి వారి మీదను యెరూషలేము నివాసుల మీదను కరుణ నొందించు ఆత్మను విజ్ఞాపన చేయు ఆత్మను నేను కుమ్మరింపగా వారు తాము పొడిచిన నా మీద దృష్టి యుంచి, ఒకడు తన యేక కుమారుని విషయమై దుఃఖించునట్లు, తన జ్యేష్ఠ పుత్రుని విషయమై యొకడు ప్రలాపించునట్లు అతని విషయమై దుఃఖించుచు ప్రలాపింతురు. (జెకర్యా 12:10)

మన పాపముల కొరకు సిలువ వేయబడిన క్రీస్తును సిలువపై చూచినపుడు, మన పాపములే క్రీస్తును సిలువ వేసినవని గుర్తెరిగినపుడు ఎట్లు దుఃఖించకుందుము? మన పాపములను ఎట్లు ఇంకనూ దాచుకొందుము? నీనెవె పట్టణస్థులకు దేవుని తీర్పును ప్రకటించినపుడు రాజు మొదలుకొని ఘనులేమి, అల్పులేమి, పశువులేమి సమస్తమును గోనెపట్ట కట్టుకొని తమ పాపములను ఒప్పుకొనుచు ప్రార్థించిరి. (యోనా 3:4-10)

గొప్ప ఉజ్జీవము రావలెనంటే, దేవుని కొరకు గొప్ప కార్యములు చేయవలెనంటే అది మొదట నీతోనే ప్రారంభించవలెను. ఎజ్రా దేవుని మందిరము ఎదుట ఏడ్చుచు, తన పాపమును ఒప్పుకొనుచున్నప్పుడు, ఇశ్రాయేలీయులలోని స్త్రీలు, పురుషులు, చిన్నవారు కూడా వచ్చి తమ తమ పాపములను ఒప్పుకొని ప్రార్థన చేయుట ప్రారంభించిరి. (ఎజ్రా 10:1) దాచబడిన పాపము ఉజ్జీవమును ఆపుజేయును. అది ఒప్పుకొని, విడిచిపెట్టునపుడు గొప్ప ఉజ్జీవము వచ్చును. "దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును." (II కొరింథీ 7:10) "ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు, దుఃఖించుచు, మనఃపూర్వకముగా తిరిగి నా యొద్దకు రండి" (యోవేలు 2:12) అని ప్రభువు పిలుచుచున్నాడు. ★

# బాప్తిస్మము ప్రార్థన

**"యేసు కూడ బాప్తిస్మము పొంది ప్రార్థన చేయుచుండగా ఆకాశము తెరవబడి పరిశుద్ధాత్మ శరీరాకారముతో పావురము వలె ఆయన మీదికి దిగి వచ్చెను."**

(లూకా 3:21, 22)

ఆయన బాప్తిస్మము పొంది ప్రార్థించుచుండెను. ఈ దినములలో అనేకులు బాప్తిస్మము పొందిన తరువాత ప్రార్థించుటకు, సాక్ష్యమిచ్చుటకు బదులు నేను బాప్తిస్మము పొందితిని కదా! ఇక నేను పరలోకమునకు వెళ్లెదనని తృప్తిపడిపోవు చున్నారు.

బాప్తిస్మము పొందిన తరువాత ప్రార్థించుచు క్రీస్తు కొరకు జీవించుటకు బదులు; మరల పాత అలవాట్ల వైపుకే వెళ్లుచు సైతానునే సేవించుచున్నారు. పేరుకు మాత్రము నీళ్లలో మునిగి లేచుచున్నారు.

బాప్తిస్మమునకు ముందు ప్రార్థనతో నీ హృదయమును సిద్ధపరచుకొని నీ పాపముల కొరకై పశ్చాత్తాప పడవలెను. తరువాత నీవు పరిశుద్ధాత్మ కొరకు ప్రార్థించవలెను. యేసు బాప్తిస్మము పొంది ప్రార్థించుచుండగా ఆకాశము తెరవబడి పరిశుద్ధాత్మ శరీరాకారముతో పావురమువలె ఆయన మీదకు దిగి వచ్చెను. ఆయన ఆత్మచేత నింపబడి తన సేవను ప్రారంభించెను. ఆదిసంఘములోని సభ్యులు కూడా మేడగదిలో ప్రార్థించుచుండగా పరిశుద్ధాత్మను పొందిరి. (అపొ.కార్య 1:12-2:4) నీవు నీ జీవితములో పరిశుద్ధాత్మ శక్తి పొందితివా?

సీమోనను గారడీవాడు ఫిలిప్పు బోధించు సువార్తను నమ్మి బాప్తిస్మమును పొందెనుగాని తరువాత ప్రార్థించుటకు బదులు పేతురు యోహానుల ముందు ద్రవ్యమును పెట్టి నేనెవరి మీద చేతులుంచెదనో వారు పరిశుద్ధాత్మను పొందునట్లు ఈ అధికారము నాకు ఇమ్మని అడిగెను. డబ్బుతో పరిశుద్ధాత్మను, దేవుని వరమును పొందవలెనని చూచెను. వెంటనే పేతురు నీ వెండి నీతో నశించును గాక, నీ హృదయము దేవుని యెదుట సరిగా లేదు గనుక ఈ కార్యమందు నీకు పాలు పంపులు లేవు. కాబట్టి నీ చెడుతనమును మానుకొని మారు మనస్సు పొంది ప్రభువుకు ప్రార్థించుమని చెప్పెను. (అపొ.కార్య. 8:9-24) ప్రార్థనవలననే మన హృదయములను సరిచేసికొనగలము! మారుమనస్సు పొందిన తరువాతనే బాప్తిస్మము! "పేతురు- మీరు మారు మనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ.కార్య. 2:38) అనెను.

★



# తగ్గించుకొని చేయు ప్రార్థన

**"చిత్తగించుము, నేను నీచుడను, నేను, నీకు ఏమని ప్రత్యుత్తర మిచ్చెదను? నా నోటిమీద నా చేతిని ఉంచుకొందును."**

(యోబు 40:4)

యోబును గూర్చి దేవుడే ఈ విధముగా సాక్ష్యమిచ్చుచున్నాడు. "నా సేవకుడైన యోబు సంగతి ఆలోచించితివా? అతడు యథార్థవర్తనుడును, న్యాయవంతుడునై, దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు, భూమి మీద అతనివంటి వాడెవడును లేడు." (యోబు 1:8) కాని యోబు అయితే తన్నుతాను తగ్గించుకొనుచు నేను నీచుడను నేను నీకేమని ప్రత్యుత్తర మిచ్చెదను? అని అనుచుండెను. నీవు దేవుని సన్నిధికి ఇటువంటి మనస్సుతో వెళ్ళుచున్నావా?

"నీవు దేవుని సన్నిధిని అనాలోచనగా పలుకుటకు నీ హృదయమును త్వరపడనియ్యక నీ నోటిని కాచుకొమ్ము; దేవుడు ఆకాశమందున్నాడు నీవు భూమి మీద ఉన్నావు, కావున నీ మాటలు కొద్దిగా ఉండవలెను." (ప్రసంగి 5:2) నీవు దేవుని సన్నిధిలో ఎక్కువగా మాట్లాడుట కంటె ఆలకించుట శ్రేష్టము. (ప్రసంగి 5:1)

అనేకులు దేవుని మాటలు వినుటకు బదులు అనాలోచనగా మాట్లాడుచు మనుష్యులను విసికించుట చాలదన్నట్టు దేవునిని కూడ విసికించెదరు. (యెషయా 7:13) పాపము కడుగు కొనకుండా చేయు ప్రార్థనలు, ఇచ్చు అర్పణలు నేను అంగీకరింపను; అవి నాకు హేయములు వాటిని సహింపలేక విసికియున్నాను (యెషయా 1:12;13) అని ప్రభువు చెప్పుచున్నాడు.

పెదవులతో చేయు ప్రార్థనకంటె హృదయాంతరంగములో నుండి వచ్చు చిన్న ప్రార్థనే మేలు! మాటల ప్రార్థనకంటె మూల్గుల ప్రార్థన దేవుడు ఎక్కువగా అంగీకరించును. "మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదుగాని, ఉచ్చరింప శక్యముగాని మూల్గులతో ఆ ఆత్మతానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు." (రోమా 8:26)

అలవాటుగా లేక ఇతరులు వినుటకొరకు మంచి మంచి మాటలతో చేయు దీర్ఘ ప్రార్థనలు దేవునిని విసికించును, ఇటువంటి ప్రార్థన పాపమగును. (కీర్తన 109:7) అందువలననే యోబు- ప్రభువా, నేను నీచుడను. ఏలాగు యుక్తముగా ప్రార్థన చేయాలో తెలియనివాడను, నా నోటిమీద చేతులు ఉంచుకొను చున్నాననెను. (యోబు 40:4) గనుక ప్రభువా నాకు తగ్గించుకొని చేయు ప్రార్థన నేర్పుము, అని ప్రార్థించుదము!

★

# ఉపవాస ప్రార్థన

**"మీరు ఉపవాసము చేయునప్పుడు వేషధారులవలె దుఃఖముఖులై యుండకుడి; తాము ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని వారు తమ ముఖములను వికారము చేసికొందురు; వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను."** (మత్తయి 6:16)

ఈ దినములలో క్రైస్తవులు ఉపవాసముండి ప్రార్థన చేయవలెనని చెప్పినచో వింతగా చూచెదరు. బైబిలులో మోషే ఎట్లు ఉపవాసముండి ప్రార్థించెనో; ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు అవసరత సమయంలో ఉపవాస ప్రార్థనతో ఎట్లు జయమును సంపాదించిరో; మన ప్రభువైన క్రీస్తు కూడా ఎట్లు ఉపవాస ప్రార్థన చేసెనో బైబిలులో చదివియు, ఏమియు ఎరుగనట్లుందురు!

ప్రభువు ఒకసారి ఉపవాసము వలనను, ప్రార్థన వలనను మాత్రమే వీటిని జయింపవచ్చునని దయ్యములను వెళ్ళగొట్టలేకపోయిన శిష్యులతో చెప్పెను. (మార్కు 9:28,29) నిన్ను వెంటాడే పాపమును జయించుటకు, నీకసాధ్యమగు సమస్యను పరిష్కరించుకొనుటకు ఉపవాస ప్రార్థనలు ఎంతో అవసరము! నీవు ఉపవాసముండి ప్రార్థన చేయునపుడు నీవు మామూలుగా తెలుసుకొనలేని నీ మోసకరమైన స్వభావమును లోతుగా ఎరుగుదువు, పాపము మీద జయము పొందెదవు.

కొందరు వేషధారులుగా ఉపవాసముందురు. "కలహపడుచు, వివాదము చేయుచు, అన్యాయముగా గుద్దులాడుచు ఉపవాసముందురు." (యెషయా 58:4) గాని ప్రభువు మీరు ఉపవాసముండునపుడు వేషధారుల వలె దుఃఖముఖులై యుండకుడి అని చెప్పెను. ఉపవాస మున్నప్పుడు వ్యర్థమైన మాటలకు, వాదనలకు చోటియ్యక ఎక్కువగా ప్రార్థించవలెను. లేనిచో బలపడుటకు బదులు బలహీనమగుదురు. దేవుని ఆత్మకు బదులు దయ్యపు ఆత్మ నిన్ను పట్టుకొనును. కావున జాగ్రత్తగా ఉండి ప్రార్థించుము.

వారమునకు ఒకసారి లేక రెండుసార్లు ఉపవాసముండి ప్రార్థించినచో దేవుని గొప్ప కార్యములు చూచెదవు, పరిశుద్ధపరచబడెదవు, జయ జీవితమును జీవించెదవు! (మార్కు 9:29)

★



# ఒప్పుకోలు ప్రార్థన!

**"ఎజ్రా యేడ్చుచు దేవుని మందిరము ఎదుట సాష్టాంగపడుచు, పాపమును ఒప్పుకొని ప్రార్థన చేసెను."** (ఎజ్రా 10:1)

ప్రార్థనలో పాపపు ఒప్పుకోలు ఉండవలెను. అనేకులు 'నేను పాపిని, నేను పాపిని' అని మాత్రమే ఒప్పుకొందురు. నీవు అట్లు ప్రారంభించుట సరియే! కాని, నీవు అట్లు ప్రార్థించుచున్నప్పుడు ప్రభువు నీ పాపములను స్పష్టముగా నీకు చూపించుచుండును. అప్పుడు నీవు బహిరంగంగా ఒప్పుకొనవలెను. దేవుని దగ్గర ఒప్పుకొనవలసినవి దేవుని దగ్గర; మనుష్యుల దగ్గర ఒప్పుకొనవలసినవి మనుష్యుల దగ్గర ఒప్పుకొనవలెను. అప్పుడే నీవు శుద్ధ హృదయమును, లోతైన ప్రార్థనా జీవితమును పొందగలవు. అనేకులు సిగ్గు వలనను, భయము వలనను, పాపము ఒప్పుకొనరు. ఒప్పుకొనని పాపమునకు క్షమాపణ లేదు సుమా!

"మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును." (I యోహాను 1:9)

మరికొందరు దేవుడు చూపించుచున్న పాపమును వదులుకొనుటకు ఇష్టము లేనందువలన ఆ పాపమును ఒప్పుకొనకుండా "నేను పాపిని, నేను పాపిని" అని చేయు ప్రార్థనతోనే ఆగిపోవుదురు. నీవు చేయు ప్రతి పాపము దేవునికి వ్యతిరేకముగా చేయుచున్నందువలన ప్రతి పాపమును దేవుని యొద్ద ఒప్పుకొనవలెను. "అతిక్రమములను దాచి పెట్టువాడు వర్ధిల్లడు, వాటిని ఒప్పుకొని విడిచి పెట్టువాడు కనికరము పొందును" (సామెతలు 28:13) అని వాక్యము చెప్పుచున్నది. తప్పిపోయిన కుమారుడు తండ్రి యొద్దకు తిరిగి వచ్చి "తండ్రీ! నేను పరలోకమునకు విరోధముగాను, నీ యెదుటను పాపము చేసితిని. ఇకమీదట నీ కుమారుడను అనిపించుకొనుటకు యోగ్యుడను కాననెను." (లూకా 15:21)

మన పాపమును మాత్రమే కాక మన పితరుల పాపమును కూడా ఒప్పుకొని ప్రార్థన చేయవలెను. నేనును, నా తండ్రి ఇంటివారును పాపము చేసియున్నాము. (నెహెమ్యా 1:16) ఇట్లు నీ వ్యక్తిగత పాపమును ఒప్పుకొని ప్రార్థించినచో నీవు తప్పక పాపము నుండి విడుదల పొందుదువు. హృదయములో పాపమును దాచుకొని పాపమును ఒప్పుకొనకుండా, పెదవులతో చేయు ప్రార్థన దేవుడు వినడు. అటువంటి ప్రార్థన దేవునికి అసహ్యము. దానియేలు గ్రంథము 9వ అధ్యాయములో దానియేలు ఎట్లు తన పాపమును, తన ప్రజల పాపములను ఒప్పుకొనుచున్నాడో చదవండి. ప్రభువా! ఒప్పుకోలు ప్రార్థన నేర్పుము, అని ప్రార్థించండి.

★

# గోజాడు ప్రార్థన

**"ఈ విధవరాలు నన్ను తొందరపెట్టుచున్నది. కనుక ఆమె మాటిమాటికి వచ్చి గోజాడకుండునట్లు ఆమెకు న్యాయము తీర్తునని తనలో తాననుకొనెను".**

(లూకా 18:5)

ప్రార్థనలో గోజాడుట! ఒక చిన్న బిడ్డకు ఆహారము గాని, వస్తువు గాని కావలసి వచ్చినచో తన తల్లినో తండ్రినో అడుగును. వారు "ఇప్పుడు లేదు, ఇప్పుడు వీలుపడదు" అని చెప్పినను విడువక వారివెంట తిరుగుచు 'నాకిమ్ము, నాకిమ్ము' అని ఇచ్చు వరకు గోజాడుచుండును.

దేవునికి భయపడని, మనుష్యులను లక్ష్యపెట్టని ఒక న్యాయాధిపతి యొద్దకు ఒక విధవరాలు వెళ్ళి నాకు న్యాయము తీర్చుమని అడిగినపుడు అతడామెను లక్ష్యపెట్టకపోయినను ఆమె మాటిమాటికి వెళ్ళి గోజాడుచుండుట వలన ఆ కఠినుడైన న్యాయాధిపతి ఆమెకు న్యాయము తీర్చెను. అట్లయిన దేవుడు తాను ఏర్పరచు కొన్నవారు దివారాత్రములు తన్ను గూర్చి మొఱ్ఱపెట్టుచుండగా వారిని గూర్చి న్యాయము తీర్చడా? (లూకా 18:6,7) అని దేవుని వాక్యం చెప్పుచున్నది.

గోజాడు ప్రార్థన అనగా పది నిముషములు లేక ఒక గంట సేపు చేయు ప్రార్థన కాదు. "ప్రభువా ఇది నెరవేర్చుము, ప్రభువా నా ప్రార్థన వినుము" అని దివారాత్రములు హృదయములో నుండి వచ్చు మూల్గుల ప్రార్థన! 'క్రీస్తు శరీరధారియై యున్న దినములలో మహారోదనముతోను, కన్నీటితోను తన్ను మరణము నుండి రక్షింపగలవానికి ప్రార్థనలను, యాచనలను సమర్పించెను' (హెబ్రీ 5:7) అని వ్రాయబడియున్నది.

ఇట్లు ప్రభువు సన్నిధిలో నీవు ప్రార్థించుచున్నావా? నీకు శూలములవలె నున్న నీ పొరుగువారి కొరకు, మారు మనస్సు పొందని నీ బంధువుల కొరకు గోజాడి ప్రార్థించుము. ఈ రోజు నీ ఇరుగుపొరుగు నున్న వారి కొరకు ప్రార్థించి, వారికి నీ సాక్ష్యము చెప్పనియెడల; రేపు వారే నీ ప్రక్కలో శూలములుగా మారెదరు. (సంఖ్యా కాండము 33:55) మనము ప్రార్థించవలసిన వారి కొరకు ప్రార్థించకపోతే అది పాపమగును. (I సమూయేలు 12:23) "తనకు మొఱ్ఱపెట్టువారి కందరికి తనకు నిజముగా మొఱ్ఱపెట్టువారందరికి యెహోవా సమీపముగా ఉన్నాడు." (కీర్తన 145:18) గనుక నిరుత్సాహపడక ప్రభువు సన్నిధిలో మొఱ్ఱపెట్టుము. తప్పక జవాబు పొందెదవు.

★



# ఆత్మ ప్రార్థన

**"కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును"**

(I కొరింథీ 14:15)

ఇక్కడ పౌలు ఆత్మతోను, మనస్సుతోను ప్రార్థన చేయుదును అని చెప్పుచున్నాడు. కొందరు నేను ఆత్మతో ప్రార్థన చేయుచున్నానని చెప్పుదురు. సమయ సందర్భములు పట్టించుకొనకుండా పరిస్థితులను గమనించుకొనకుండా గ్రుడ్డి ఎద్దు చేలో పడినట్టుగా ఏదో ప్రార్థించుదురు. గాని నీవు ప్రార్థన చేయునది ఏమిటో నీవు ఎరుగవలెను. నీ ప్రార్థన ఆత్మ ద్వారా నీ మనస్సులో నుండి రావలెను; గ్రహింపుతో ప్రార్థించవలెను.

అనేకులు కుటుంబ ప్రార్థనలో దీర్ఘ ప్రార్థనలు చేయుచున్నందున ఇంటిలో ఉన్న బిడ్డలు ప్రార్థనయందు ఆసక్తి పోగొట్టుకొనుట గమనించగలం! మన ప్రార్థనలో ఇతరులు ఏకీభవిస్తున్నారా? మన ప్రార్థన ఇతరులను ఉత్తేజపరుస్తున్నదా? అనే గ్రహింపుతో ప్రార్థించుట ఆత్మతో, మనస్సుతో ప్రార్థించుట! కొందరు గుంపులో ప్రార్థించునపుడు తన చుట్టు ఎంత మంది ఉన్నారో, ఎంత సమయమున్నదో గ్రహించుకొనకుండా చాలా సమయము వారొక్కరే ప్రార్థించుదురు. ఇది ఆత్మతోను, మనస్సుతోను చేయు ప్రార్థన కాదు. నీవు గుంపుతో ప్రార్థన చేయునపుడు నా తరువాత ప్రార్థన చేయవలసిన వారు యింకను యింత మంది ఉన్నారు, కొద్ది సమయమే ఉన్నది అను గ్రహింపు కలిగి; నీవు బిగ్గరగా చేయు ప్రార్థన ఆపి, ఇతరులు ప్రార్థన చేయునట్లు అవకాశమిచ్చి, వారితో ఏకీభవించి ప్రార్థించుట ఆత్మతోను, మనస్సుతోను ప్రార్థించుట!

ఆత్మలో ప్రార్థన చేయుట అనగా కేవలము మాటలతో గట్టిగా చేయు ప్రార్థన మాత్రము కాదు. ఆత్మలో ప్రార్థించువారు ఇతరులతో ఏకీభవించువారు. వారు పది మందితో కలిసి గంట సేపటిలో చేసిన ప్రార్థనలో వారు చేసినది ఐదు నిమిషములు అయినా నేను ఐదు నిముషములే ప్రార్థించితిని అని అనుకొనరు గాని గంటసేపు ప్రార్థించితిని అని అనుకొందురు. ఎందుకనగా ఇతరులు ప్రార్థన చేయునపుడు కూడా ఆత్మలో వారితో ఏకీభవించి ప్రార్థించుచుందురు. మనము ఒంటరిగా ఉన్నప్పుడు గంటల తరబడి ఆత్మలో ప్రార్థించుకొనుచు, దేవుని స్తుతించుచు ఉండవచ్చును గాని మనము గుంపులో ప్రార్థన చేయునప్పుడు గ్రహింపుతో, మనస్సుతో ప్రార్థించుట నేర్చుకొనవలెను. ప్రభువా! నాకు ఆత్మతో చేయు ప్రార్థన నేర్పుము అని అడుగుము!

★

# వేదనతో కూడిన ప్రార్థన

**“ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థనచేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను.” (లూకా 22:44)**

ప్రార్థనలో వేదన! మన పాపము కొరకు మనము వేదన పడవలెను. మన పాపము ఎంతఘోరమైనదో; దేవునికి ఎంత దుఃఖమును, మనకు ఎంత నష్టమును కలిగించు చున్నదో తెలుసుకొని వేదన పడవలెను.

ప్రభువు వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా, ఆయన చెమట నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను. గెత్సెమనే తోటలో ఆయన మీదికి లోక పాప భారమంతయు వచ్చినప్పుడు వేదనతో ప్రార్థించెను, మన పాపముల కొరకు ఆయన వేదన పడెను. అలాగే రక్షింపబడిన తరువాత మనము కూడా ఇతరుల ఆత్మరక్షణ కొరకు వేదనతో ప్రార్థించవలెను.

ప్రతితల్లి తనబిడ్డను కనుటకు ప్రసవవేదన పడును. ప్రసవవేదన పడకుండా ఏ తల్లి బిడ్డను కనలేదు. “నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీ యందేర్పడు వరకు మీ విషయమై మరల నాకు ప్రసవవేదన కలుగుచున్నది” అని పౌలు గలతీయులకు వ్రాసెను. (గలతీ 4:19) దేవుని సన్నిధిలో ప్రసవవేదన పడకుండా మనము ఆత్మలను సంపాదించలేము. (యెషయా 66:8)

ప్రియ సహోదరుడా! సహోదరీ!! నీ పాపముల కొరకు నీవు వేదనతో ప్రార్థించుచున్నావా? దేవుని దుఃఖపరచుచు, సైతాను ఉచ్చులలో ఉన్నవారు విడిపించబడి, తిరిగి జన్మించి క్రీస్తురాజ్యమునకు వారసులగునట్లు ఆత్మల కొరకు ప్రార్థనలో ప్రసవవేదన పడుచున్నావా?

క్రీస్తు శరీరధారియై యున్న దినములలో మహారోదనముతోను, కన్నీళ్ళతోను, తన్ను మరణము నుండి రక్షింపగలవానికి ప్రార్థించుచుండెను. (హెబ్రీ 5:7) నిత్య మరణమునకు లోనైయున్న ఇతరులకొరకు ప్రార్థించుచుండెను. ఇట్లు వేదనతోను, నిట్టూర్పులతోను మన స్వభావము మార్పు కొరకు, ఆత్మల రక్షణ కొరకు ప్రార్థించుట మనము నేర్చుకొనవలెను. అప్పుడు దేవుడు ఇచ్చు జయమును మన జీవితములోను, ఆత్మల రక్షణ మన సేవలోను చూడగలము!

★



# విజ్ఞాపన ప్రార్థన

**ఆ మనుష్యులు అక్కడ నుండి తిరిగి సొదొమవైపుగా వెళ్ళిరి. అబ్రాహాము ఇంకా యెహోవా సన్నిధిని నిలుచుండెను.” (ఆదికాండము 18:22)**

ముగ్గురు దూతలు అబ్రాహాము ఇంటికి వచ్చి, ఆశీర్వదించి వెళ్ళిరి గాని; అబ్రాహాము తాను ఆశీర్వదింపబడుటతో తృప్తి చెందక యెహోవా సన్నిధిలో నిలిచి, తన బంధువైన లోతు కొరకు విజ్ఞాపన చేయుచుండెను. ఎంతో దీనత్వముతో తన్ను తాను తగ్గించుకొనుచు; దేవుని కృపను, నీతిని జ్ఞాపకం చేయుచు ప్రార్థించుచుండెను.

దుష్టులతో పాటు నీతిమంతులను కూడా నాశనం చేయుదువా? యాభై మంది నీతిమంతులున్నచో ఆ పట్టణమును కాపాడవా అని మొదలు పెట్టి, మెల్ల మెల్లగా బ్రతిమలాడుచూ, పదిమంది ఉన్నచో ఆ పట్టణమును నాశనం చేయకుండా మానవా? అని బ్రతిమాలుచూ; దేవుని న్యాయ తీర్పుకు గురియై, నాశనము కాబోవు చున్న పట్టణము కొరకు విజ్ఞాపన చేయుచుండెను. (ఆదికాండము 18:23-32)

ఇట్లు నీ బంధువుల కొరకు, దేవుని తీర్పుకు గురికానై యున్న పాపాత్ముల కొరకు విజ్ఞాపన చేయుట నేర్చుకొనుచున్నావా? నశించుచున్న ఆత్మల కొరకు నీకు భారమున్నదా? ఒక సెకండుకు ఎనభైమూడు ఆత్మలు నిత్య నరకమునకు వెళ్లుచున్నారని నీవు ఎరుగుదువా?

ఇశ్రాయేలీయులు పాపము చేసినపుడు దేవుని కోపము వారి మీద రగులుకొనగా, మోషే దేవుని సన్నిధిని నిలిచి వారి కొరకు విజ్ఞాపన చేసినందు వలన వారు తప్పింపబడిరి. (నిర్గమ కాండము 32:30-34) అబ్రాహాము యొక్క విజ్ఞాపన ప్రార్థన వలన లోతు కుటుంబము నాశనమగుచున్న పట్టణము నుండి వెలుపలికి తీసుకొనిరాబడెను. (ఆదికాండము 19:1-29)

నీవు విజ్ఞాపన ప్రార్థన నేర్చుకొంటే, అనేకులకు ఆశీర్వాదకరముగా ఉందువు. విజ్ఞాపన ప్రార్థన అనగా ఇతరుల స్థానంలో నిన్ను పెట్టుకొని, వారి పాపమును నీ పాపముగా ఒప్పుకొనుచు; వారి వేదనలో, వారి బాధలో, వారి స్థానంలో నిన్ను పెట్టుకొని నీవు ప్రార్థించుటయే! ప్రతి తండ్రి కుటుంబ సభ్యుల కొరకు, ప్రతి సంఘకాపరి తన సంఘస్థులందరి కొరకు విజ్ఞాపన చేయుట నేర్చుకొనవలెను. నశించుచున్న ఆత్మల కొరకు రక్షించబడిన ప్రతి విశ్వాసి విజ్ఞాపన ప్రార్థన చేయుట నేర్చుకొనవలెను. పరలోకమునకు చేర్చబడి, దేవుని కుడి పార్శ్వమున కూర్చుని యున్న యేసుప్రభువు మన కొరకు విజ్ఞాపన చేయుచున్నాడు. (రోమా 8:34) విజ్ఞాపన ప్రార్థన చాలా గొప్పది. ప్రభువా! విజ్ఞాపన ప్రార్థన మాకు నేర్పుము అని ఇప్పుడైనా ప్రార్థించుదము.

★

# ఆసక్తి ప్రార్థన

**"పేతురు చెరసాలలో ఉంచబడెను, సంఘమయితే అతని కొరకు ఆత్యాసక్తితో దేవునికి ప్రార్థన చేయుచుండెను."** **(అపొ. కార్య. 12:5)**

అంతకు ముందే హేరోదు అపొస్తలుడైన యాకోబును తల గొట్టించెను. (అపొ.కార్య. 12:1, 2) ఇప్పుడు పేతురును కూడా చెరసాలలో పెట్టించెను. సంఘమంతయు ఎంతో కలవరముతోను, నిరుత్సాహముతోను నిండుకొని యుండెను. అయినప్పటికిని వారందరు ఆసక్తితో ప్రార్థన చేయుచుండిరి.

కొందరు నిరుత్సాహము కలిగినపుడు ఆసక్తితో ప్రార్థించుటకు బదులు నిద్రించెదరు. అయ్యో! యాకోబును చంపివేసినారే, పేతురును చెరసాలలో వేసినారే, మా గతి ఏమిటి? అని వారు నిరుత్సాహపడి చెల్లాచెదురు అవలేదు గాని, వారందరు ఏకముగా కూడి, ఏక మనస్సుతో అద్భుతములు చేయగల ప్రభువునకు అత్యాసక్తితో ప్రార్థించుచుండిరి.

మనము అనేక విషయములలో ఆసక్తి చూపెదము! కాని, ప్రార్థన కొరకు అటువంటి ఆసక్తి ఉన్నదా? ప్రతి ఉదయమున కుటుంబమును ఆసక్తితో కుటుంబ ప్రార్థనకు చేర్చగలుగుచున్నావా? ఆలయములో జరుగు ప్రార్థనా కూటములకు ఆసక్తితో హాజరై ప్రార్థిస్తున్నావా?

పేతురును ప్రభువు విడిపించు వరకు, మన ప్రార్థనకు జవాబు వచ్చు వరకు ప్రార్థింతుమని ఆసక్తితో వారు ప్రార్థించిరి. అటువంటి ప్రార్థనలను దేవుడు విని దూతను పంపి పేతురును చెరసాల నుండి విడిపించెను. పేతురు వారి యొద్దకు వచ్చునప్పటికి వారు ఇంకనూ ప్రార్థించుచుండిరి. (అపొ.కార్య. 12:7-12) ఆసక్తితో చేసిన ప్రార్థనలకు ఎంత త్వరితమైన జవాబు! ఇనుప సంకెళ్లతో కట్టబడి, ఇద్దరు సైనికుల మధ్య గదిలో బంధించబడి ఉన్న పేతురును; కావలిని, ఇనుపగేటును దాటించి బయటకు తెచ్చినది వారి ఆసక్తి ప్రార్థనే!

నీవు ఆసక్తితో ఇతరులతో చేరి ఏక మనస్సుతో ప్రార్థించినపుడు అది ఎటువంటి సమస్యయైనను, కష్టమైనను, బంధకములైనను దేవుడు పరిష్కరించుట చూచెదవు. ప్రార్థన యందు ఆసక్తి కలిగియుండుము. ప్రభువు యొద్ద నుండి గొప్ప కార్యములను చూచెదవు. (రోమా 12:11)

★



# ప్రభువుతో మాటలాడు ప్రార్థన

**"ఇదిగో ధూళియు బూడిదెయునైన నేను ప్రభువుతో మాటలాడ తెగించు చున్నాను."** **(ఆదికాండము 18:27)**

అబ్రాహాము దేవుని పిలుపునకు విధేయుడై తన దేశమును, బంధువులను వదలి దేవుని వెంబడించుచుండెను. (ఆదికాండము 12:1-4) దేవుని దూతలు అతని గుడారమును దర్శించినపుడు వారికి ఆతిథ్యమిచ్చి; వాగ్దానములను, ఆశీర్వాదములను పొందెను. (ఆదికాండము 18:1-15)

అయినను తాను దేవుని కొరకు ఎంతో తాగ్యము చేసితినని గాని, తానెంతో నిందారహితముగా జీవించుచున్నానని గాని గర్వించక; ఇదిగో ధూళియు, బూడిదెయునైన నేను నీతో మాటలాడుటకు తెగించితిని అని తన్ను తాను తగ్గించుకొని దేవుని సన్నిధిలో ప్రార్థించుచుండెను. (ఆదికాండము 18:27)

నీవు ప్రార్థనకు వెళ్ళునపుడు ఇటువంటి దీన మనస్సుతో ప్రభువు సన్నిధికి వెళ్ళవలెను. "ప్రభువా! నేను నీతో మాట్లాడుటకు కూడా తగినవాడను కాను, నేను ఏమైయున్నానో అది నీ కృప వలననే అయియున్నాను" (I కొరింథీ 15:10) అన్నట్లు ప్రార్థించవలెను, నీ ప్రార్థన దేవునిని ఆజ్ఞాపించునట్లుగా కాక, దీనతతో ఆయనను అడుగుకొనునట్లుగా యుండవలెను.

అబ్రాహాము తగ్గించుకొని తన బంధువుడైన లోతు కొరకు, అతని కుటుంబము కొరకు ప్రార్థించుచుండెను. రాత్రంతయు యెహోవా సన్నిధిలో కన్నీటితో బ్రతిమాలుచుండెను. (ఆదికాండము 18:23-32) మారుమనస్సు పొందిన నీవు, దీనతతో నీ తల్లిదండ్రుల కొరకు, రక్తసంబంధుల కొరకు ప్రార్థించవలెను. నీ ప్రార్థన తప్పక నీ బంధువులకు ఆశీర్వాదమగును.

ప్రభువా! నీ సన్నిధిలో ప్రార్థించుటకు ఎంత మాత్రము యోగ్యుడను కాను, నీ గొప్ప కనికరమును బట్టియే నీకు ప్రార్థించుచున్నాను. గాని నా స్వనీతి కార్యములను బట్టి నీ సన్నిధిలో ప్రార్థించుట లేదు. నీ కృపతో నన్ను క్షమించి నా ప్రార్థన నాకును, ఇతరులకును ఆశీర్వాదకరముగా చేయుము అని ప్రార్థించుము!

ప్రార్థనలో మనము ప్రభువుతో మాటలాడవలెనని యనినచో మనలను మనము తగ్గించుకొనవలెను. అప్పుడు దీనులకు కృప చూపు ప్రభువు మనతో మాటలాడును.

★

# పోరాడు ప్రార్థన

**"అప్పుడు ఆయన – నీవు దేవునితోను మనుష్యులతోను పోరాడి గెలిచితివి గనుక ఇకమీదట నీ పేరు ఇశ్రాయేలే గాని యాకోబు అనబడదని చెప్పెను."**
**(ఆదికాండము 32:28)**

"అప్పుడు యాకోబు – నేను తిరిగి నా తండ్రి ఇంటికి క్షేమముగా వచ్చునట్లు దేవుడు నాకు తోడైయుండి, నేను వెళ్ళుచున్న ఈ మార్గములో నన్ను కాపాడి, తినుటకు ఆహారమును, ధరించుకొనుటకు వస్త్రములను నాకు దయచేసిన యెడల యెహోవా నాకు దేవుడై యుండును" (ఆదికాండము 28:20, 21) అని బేతేలులో యాకోబునకు దేవుడు కనిపించినపుడు ప్రార్థించెను. తిండి, వస్త్రములు, కాపుదల కలిగి యుండుటయే దేవుని ఆశీర్వాదమని తలంచి వాటి కొరకు పోరాడెను. గాని శుద్ధమైన, సమాధానకరమైన హృదయము కలిగి యుండుటయే నిజమైన ఆశీర్వాదము అని ఎరుగకుండెను. అయితే, తాను అడిగినవన్నియు సంపాదించు కొనిన తరువాత అది ఆశీర్వాదము కాదని గుర్తించి; రెండవసారి శుద్ధమైన, నూతన హృదయముకొరకు దేవుని దూతతో పోరాడుచుండెను. (ఆదికాండము 32:24-26) అంతవరకు తండ్రితోను, అన్నతోను, మామతోను పోరాడి ఏమేమో సంపాదించు కోవాలనుకున్నాడు. గాని, ఇప్పుడు ఆధ్యాత్మికమైన ఆశీర్వాదముల కొరకు దేవునితో పోరాడుచున్నాడు.

మనలో అనేకులము మనకు కావలసిన వాటి కొరకు, మన ఇష్టము నెరవేర్చుకొనుటకు మనుష్యులతో పోరాడి సంపాదించుకొందుము. గాని, దేవుని యొద్ద నుండి నిజమైన ఆశీర్వాదమును సంపాదించుకొనుటకు, పరిశుద్ధమైన హృదయమును సంపాదించుకొనుటకు దేవుని సన్నిధిలో పోరాడుచున్నామా?

నీవు నన్ను ఆశీర్వదించితేనే గాని నేను నిన్ను వదలనని యాకోబు దేవుని దూతతో తెల్లవారు వరకు పోరాడుచుండెను. ఇట్లు దేవుడు నీ పాపములు క్షమించు వరకు, నీ మనస్సాక్షి శుద్ధీకరింపబడు వరకు దేవుని సన్నిధిలో పోరాడుచున్నావా? యాకోబు దేవునితోను, మనుష్యులతోను పోరాడి గెలిచెను. "తల్లి గర్భమందు యాకోబు తన సహోదరుని మడిమెను పట్టుకొనెను, మగసిరి కలవాడై అతడు దేవునితో పోరాడెను. అతడు దూతతో పోరాడి జయమొందెను, అతడు కన్నీరు విడిచి అతని బ్రతిమాలెను.... అక్కడ ఆయన మనతో మాటలాడెను." (హోషేయ 12:3, 4) ఇట్లు ప్రార్థనలో పోరాడినచో దేవుడు నీతో మాట్లాడును. నిజమైన ఆశీర్వాదములను, జయ జీవితమును ఇచ్చును గనుక ప్రార్థనలో పోరాడుము!

★



# యెడతెగని ప్రార్థన

**"యెడతెగక ప్రార్థన చేయుడి"** (I థెస్స 5:17)

క్రీస్తు పునరుత్థానుడై పరలోకమునకు ఆరోహణమైన తరువాత క్రీస్తు యొక్క శిష్యులు, విశ్వాసులు, కొందరు స్త్రీలు ఏకముగా చేరి ఏక మనస్సుతో యెడతెగక మేడగదిపై ప్రార్థించుచుండిరి. అన్న పానములు మరచి పరిశుద్ధాత్మ కొరకు యెడతెగక ఒకరి వెంట ఒకరు ఏక మనస్సుతో ప్రార్థించుచుండినపుడు పరిశుద్ధాత్మ వారిమీదికి దిగెను. వారు గొప్ప కార్యములు చూచిరి. శక్తితో నింపబడిరి. (అపొ.కార్య. 1:12-2:4)

యెడతెగక చేయు ప్రార్థన అనగా ఏమి చేయుచున్నప్పటికి ప్రార్థనా మనస్సుతో ఉండుట, హృదయములో ప్రార్థనాత్మ కలిగి ప్రార్థించుచునే యుండుట!

కొందరు ఈ దినము నాకు బాగా ప్రార్థన వచ్చుటలేదు. నిన్న మొన్న బాగా ప్రార్థించాను, కొన్ని కొన్ని సార్లు బాగా ప్రార్థిస్తున్నాను; కాని కొన్నిసార్లు ప్రార్థన వచ్చుట లేదు, ఇతరులతో ప్రార్థనలో కలువలేకపోవుచున్నాను అందురు. అది యెడతెగకుండా చేయు ప్రార్థన కాదు. యెడతెగని ప్రార్థన జీవపు ఊట వంటిది. అట్టి ప్రార్థన ఎల్లప్పుడు నీ హృదయములో నుండి వస్తూనే యుండును. ఎడతెగక ప్రార్థించేవాడు, విసుగక ప్రార్థించేవాడు. అంటే, ఎల్లప్పుడూ ప్రార్థనా గదిలోనే ఉండేవాడని కాదుగాని అతని హృదయములో నుండి ఎల్లప్పుడు ప్రార్థనా ధూపము ప్రభువు సన్నిధికి చేరుచుండును.

అతని హృదయం ఎల్లప్పుడూ, ఎల్లవేళలా, అన్ని స్థలాల్లో దేవునివైపు ఎత్తబడి ఉండును. గనుక ఏ వస్తువుచేతనైనను, ఏ వ్యక్తి చేతనైనను ఆటంకపరచబడడు. విశ్రాంతి తీసుకొంటున్నప్పుడు, స్నేహితులతో ఉన్నప్పుడు, వ్యాపారములో ఉన్నప్పుడు, సంభాషణలో ఉన్నప్పుడు అతని హృదయం ఎల్లప్పుడు దేవునితో ఉంటుంది. అతను పండుకున్నా, లేచినా దేవుడే అతని తలంపులలో ఉంటాడు. అతని చూపు ఎప్పుడూ దేవునిపై కేంద్రీకరింపబడి ఉండి, అదృశ్యుడైన దేవుని ఎల్లవేళలా చూస్తూ, సదా దేవునితో నడుస్తాడు. ప్రార్థనా మనస్సు కలిగి యుంటాడు. 'నా తలంపులన్నియు ప్రార్థనలే' అని ఒక దైవజనుడు అన్నట్లు; మనము ప్రభువు చిత్తములో ఏమి మాట్లాడినా, ఏమి తలంచినా అవి ప్రార్థనలుగా ఉండును. ఇట్టి ప్రార్థన నీలో ఉన్నదా?

★

# చేతులెత్తి చేయు ప్రార్థన

**"కావున ప్రతి స్థలమందును పురుషులు కోపమును సంశయమును లేనివారై, పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నాను."** (I తిమోతి 2:8)

చేతులెత్తుట అనగా నిస్సహాయ స్థితిని చూపించుచున్నది. మనకు సహాయము కావలసియున్నప్పుడు మన చేతులను ఎత్తెదము. "కొండలతట్టు నా కన్నులెత్తుచున్నాను. నాకు సహాయము ఎక్కడ నుండి వచ్చును? యెహోవా వలననే నాకు సహాయము కలుగును." (కీర్తన 121:1,2) మన అవసరతలలో, కష్టములలో మన చేతులను, కండ్లను ప్రభువు వైపుకు ఎత్తుచున్నామా?

అంతేగాక కోపము సంశయము లేనివారమై పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించాలి! హృదయములో ఇతరులపై కోపము పెట్టుకొని ఎంత ప్రార్థించినను ఆ మొఱ్ఱను యెహోవా వినడు. మీరు నిలుచుండి ప్రార్థించునప్పుడెల్లా మీ విరోధులను క్షమించుడి అని వాక్యం చెప్పుచున్నది. (మార్కు 11:25) హృదయములో సంశయముతో, అవిశ్వాసముతో ప్రార్థించువాడు ఏమియు పొందడు అని వాక్యము చెప్పుచున్నది. (యాకోబు 1:6-8) నా హృదయములో నేను పాపమును లక్ష్యపెట్టిన యెడల యెహోవా నా మొర వినకపోవునని దావీదు చెప్పుచున్నాడు. (కీర్తన 66:18)

యెహోవా పర్వతమునకు ఎక్కదగినవాడెవడు? ఆయన పరిశుద్ధ స్థలములో నిలువదగిన వాడెవడు? వ్యర్థమైన దానియందు మనస్సు పెట్టకయు కపటముగా ప్రమాణము చేయకయు నిర్దోషమైన చేతులును, శుద్ధమైన హృదయమును కలిగియుండు వాడే! (కీర్తన 24:3,4). నీ చేతులు పవిత్రంగా ఉన్నవా? మీరు మీ చేతులు చాపునప్పుడు మిమ్మును చూడక నా కన్నులు కప్పుకొందును. మీరు బహుగా ప్రార్థన చేసినను నేను వినను. మీ చేతులు రక్తముతో నిండియున్నవి. మిమ్మును కడుగుకొనుడి శుద్ధిచేసుకొనుడి అని ప్రభువు సెలవిచ్చుచున్నాడు. (యెషయా 1:15, 16) నీ మనస్సాక్షిని కడుగుకొనకుండా పాపపు చేతులతో, లంచములు తీసుకున్న చేతులతో చేయు ప్రార్థనను ప్రభువు విననని చెప్పుచున్నాడు.

గాని నీ మనస్సును తిన్నగా నిలిపిన యెడల, నీ చేతులు ఆయనవైపు చాపిన యెడల పాపము నీ చేతిలో నుండుట చూచి నీవు దానిని విడిచిన యెడల నిశ్చయముగా ఆయన నీ ప్రార్థనను విని నీకు జవాబిచ్చును. (యోబు 11:13-15) కనుక పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించుట నేర్చుకొనుము.

★



# పట్టుదల ప్రార్థన

**"ఆత్మవలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా యుండుడి. నా నిమిత్తము పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి."** (ఎఫెసీ 6:18-20)

ఈ ఒక్క వచనములోనే ప్రార్థనలోని అన్ని విషయములను గూర్చి వ్రాయబడియున్నది. ఆత్మ వలన ప్రార్థించండి, ప్రతి సమయమందును ప్రార్థించండి, విజ్ఞాపన ప్రార్థన చేయండి, మెలకువగా ఉండి ప్రార్థించండి, పట్టుదలతో ప్రార్థించండి. ఇటువంటి సంపూర్ణమైన ప్రార్థన మనము నేర్చుకొంటున్నామా? ప్రార్థనలో పట్టుకలిగి యుంటున్నామా? పూర్ణమైన పట్టుదలతో ప్రార్థించండి.

కొందరు నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అంటారు. అంతగా తమ పట్టును వదలరు. అటువంటి పట్టుదలతో నేను ఏమైనాసరే ప్రార్థించెదను, ఈ భారము కొరకు పట్టుదలతో ప్రార్థించెదను అని చెప్పగలుగుచున్నావా? ఉడుము పట్టు అంటారు! ఉడుమును కొండలు ఎక్కుటకు ఉపయోగించెడివారు. దాని నడుముకు త్రాడుకట్టి కొండపైకి పంపినచో అది గట్టిగా కొండపై భాగమును పట్టుకొనును. ఆ త్రాడు ద్వారా ఎంతమంది పైకి ఎక్కుచున్నను దానికి ఎంత భారముగా ఉన్నను, దాని పట్టు మాత్రము వదలదు. దానిని కొట్టినా కోసినా కూడా దాని పట్టు వదలదు.

అట్లే ప్రార్థన చేయునపుడు మనకు ప్రార్థన వలన ఎన్ని కష్టములు వచ్చినప్పటికిని అగ్ని గుండములోనో, సింహముల గుహలోనో పడవలసి వచ్చినప్పటికి, ప్రార్థన చేయవద్దని మనలను ఎంతమంది హింస పెట్టినప్పటికిని పట్టుదలతో ప్రార్థించవలెను. అట్టి పట్టుదలతో సింహముల గుహలో పడినప్పటికిని ప్రార్థించిన దానియేలు సింహాలకు ఎరయైపోలేదు గాని, సింహముల నోళ్ళను మూయించగలిగాడు. అంతేగాదు, దానియేలు దేవుడే జీవము గల దేవుడని దేశమంతా నిరూపించగలిగాడు. (దానియేలు 6:16-27)

ఇట్లు పట్టుదల ప్రార్థన నేర్చుకొన్నామా! లేక ఏదో కొంచెము ఒత్తిడి కలుగగానే పడిపోయే బల్లిపట్టు వలె మన ప్రార్థనా జీవితమున్నదా? పరీక్షించుకొందాము. పట్టుదలతో ప్రార్థించుదాము!

★

# అపవిత్రాత్మలతో పోరాడు ప్రార్థన

"యితడెల్లప్పుడును మీ కొరకు తన ప్రార్థనలలో పోరాడుచున్నాడు."
(కొలొస్స 4:12)

1660వ సంవత్సరంలో ఇంగ్లాండ్‌కు రెండవ ఛార్లెస్ రాజు కాగానే ఆధ్యాత్మిక అధోగతి ప్రారంభమయ్యింది. ఆలీవర్ క్రామ్‌వెల్ మరణంలో సూవర్ట్ కుటుంబం బైబిల్‌ను అపహాస్యం చేయడం ప్రారంభించారు.

రాజాస్థానాలలో అనుదిన బైబిలు పఠనానికి బదులు హాస్యాలు, త్రాగడం చోటు చేసుకున్నాయి; రాజుల గదులలో వేశ్యలు తిష్ట వేసారు. మత స్వాతంత్ర్యం, విశ్వాసం అడుగంటటం ప్రారంభించాయి. సామాన్య ప్రజలలో అతిగా శ్రమకు గురియైనవారు క్వేకర్లు! వీరిలో 12,000 మంది కారాగారాలలో మ్రగ్గుతున్నారు. ఈ పరిస్థితులకు దేవుడు చూపించిన విరుగుడు ఉపవాసము.

1670వ సం॥లో జార్జిఫాక్స్ అనే భక్తుడు లండన్‌లో ఖైదీలుగా ఉన్న క్వేకర్లను చూచినప్పుడు ఈ భారం తన భుజాల మీద వేసుకున్నాడు. ఆయన గుఱ్ఱంపై స్వారీ జేస్తూ ఇక ముందుకు ప్రయాణం చెయ్యలేక ఒక స్నేహితుని ఇంట్లో కూలబడ్డాడు, నిద్రాహారాలు మానివేసాడు. అపవిత్రాత్మలతో పోరాటం ఎక్కువై చివరకు దృష్టి, వినికిడి కోల్పోయాడు. చూపుద్వారా, ధ్వనిద్వారా తన ఏకాగ్రతను పాడుచేయలేని పరిస్థితులలో ఆకాశ మండలంలోని దురాత్మల సమూహాలతో పోరాటం కొనసాగించాడు. బలహీనుడైపోతున్నప్పటికి మందులను కూడా విసర్జించి ఈ గొప్పపోరాటాన్ని ఉపవాస ప్రార్థనతో కొనసాగించాడు.

జార్జిఫాక్స్ ఉపవాస ప్రార్థన కారణంగా పరిశుద్ధాత్మ ఇంగ్లాండ్ రాజకీయ రంగంలో గొప్ప మార్పును తీసుకురావడం ప్రారంభించాడు. ఛార్లెస్‌రాజు ఒక పథకం వేసాడు. దాని ప్రకారం ఫ్రాన్స్‌మీద కత్తికట్టిన డచ్‌వారిపై, ప్రొటస్టెంట్ ఇంగ్లండ్ దాడి చేయాలనేదే ఆ పథకం. అది సాధ్యపడాలంటే ఇంగ్లాండ్‌లోని ప్రొటస్టెంటుల ఆదరాభిమానాన్ని చూరగొనాలి. దాని కొరకు అతడు 1672లో "మతసహనం" అనే కార్యాన్ని ప్రారంభించాడు. దాని ఫలితంగా వేలకు వేల మంది క్రైస్తవులు జైళ్ళలో నుండి విడుదలైనారు. ఇది ఫాక్స్ యొక్క 2 సం॥ల ఉపవాస ప్రార్థనా ఫలితం. ఆ దినాల్లోనే జాన్‌బన్యన్ అనే బాప్టిస్ట్ పాదిరి జైలులో తాను వ్రాసిన కాగితాలు (యాత్రికుని ప్రయాణం) పట్టుకుని బయటపడ్డాడు.

సాతాను శక్తులు విపరీతంగా విజృంభిస్తున్న ఈ దినాల్లో జార్జి ఫాక్సు యొక్క రాజకీయ విజయం మనకొక పాఠాన్ని నేర్పిస్తుంది. ఇట్టిది ప్రార్థన ఉపవాసం వల్లనే సాధ్యం. (మార్కు 9:29) త్యాగంతో కూడిన ఇట్టి ప్రార్థనా పరిచర్య చాలా విలువైనది, నేడు మనకెంతో అవసరమైయున్నది. ఉపవాస ప్రార్థన నిర్లక్ష్య పెట్టవద్దు! ★



# మోకాళ్ల ప్రార్థన

"అతడీలాగు చెప్పి మోకాళ్ళని వారందరితో ప్రార్థన చేసెను."
(అపొ.కార్య. 20:36)

అనారోగ్యముగాను, బలహీనముగాను ఉన్న ఒక దైవ సేవకుడు ఒక ఉదయమున రోడ్డు ప్రక్కన నడుచుచు వెళ్ళుచుండగా, ఆ రోడ్డు ప్రక్కన ఒక వృద్ధుడు మోకాళ్ళ మీద ఉండి రాళ్ళను పగులగొట్టుచుండెను. ఆ రాళ్ళను పగులగొట్టి ఒక రూపములోనికి తెచ్చుచున్నాడు. దైవ సేవకుడు ఆ వృద్ధుని పలుకరించి నీ వయస్సు ఎంత అని అడిగెను. అందుకు ఆ వృద్ధుడు దేవుడు నాకు వచ్చే బుధవారం వరకు ఆయుష్షునిచ్చిన యెడల, నాకు 72 సంవత్సరములు నిండునని చెప్పెను. నీవింత కష్టపడుట వలన నీకు అలసట వచ్చుట లేదా? అని ఆ సేవకుడు అడిగెను. 'ఇది కష్టమైన పనియే! నిలువబడి ఈ పని చేయాలంటే నడుము విరుగుతుంది. గాని మోకాళ్ళ మీద ఉండుట వలన చేయగల్గుచున్నాను' అని వృద్ధుడు జవాబిచ్చెను. అందుకా దైవసేవకుడు 'నీ పని కంటె నా పని ఇంకా కష్టమైనదనెను. "నీ పని అంత కష్టమైనదా? అదేమి పని" అని ఆ వృద్ధుడు అడిగెను.

అందుకా బోధకుడు 'ఆత్మలు రక్షించుట అను భారమైన పనిలో నేను కృంగిపోవుచున్నాను. నీవు సులభముగా రాళ్ళను పగులగొట్టినట్లు మానవుల కఠిన హృదయములను నేను పగులగొట్ట గల్గినయెడల ఎంత బావుండును! అనెను. "ఒకవేళ మీరు నిలువబడి ఎక్కువ పనిచేయుచున్నారేమోనండి! మోకాళ్ళ మీద ఉండి ప్రభువు సహాయము కోరిన యెడల ఆ కఠిన హృదయములను సులభంగా పగులగొట్టగలరు. మీ పని చక్కగాను, సులభంగాను చేయగలరు" అని ఆ వృద్ధుడు సలహా ఇచ్చెను.

అప్పటి నుండి ఆ బోధకుడు మోకాళ్ళ మీద పడి ఒక్కొక్క ఆత్మ కొరకు ప్రభువు సన్నిధిలో విజ్ఞాపన చేయుచుండగా వేల కొలది ఆత్మలను సులభంగా రక్షణలోనికి నడిపించగలిగెను.

దానియేలు అనుదినము ముమ్మారు మోకాళ్ళుని, దేవునికి ప్రార్థన చేయుచు, ఆయనను స్తుతించుచు వచ్చెను (దానియేలు 6:10) యేసుప్రభువు కూడా మోకాళ్ళుని ప్రార్థించెను. (లూకా 22:41) గనుక మోకాళ్ళుని ప్రార్థించుట నేర్చుకొందాము. ★